# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**APRIL - 2015**

సంవత్సర చందా రూ. 50/-

## సంక్షిప్త వార్తలు

2015 మార్చి 13వ తేదీ శుక్రవారంనాడు రిక్కీగూటం దంపతులు వారి కుమారుడు జస్టిన్ గూటం గారు కర్నాటక పర్యటన నిమిత్తమై బయలు దేరి వెళ్లిరి. ఆ మరునాడు వారు బెంగుళూరు పట్టణం చేరుకొని రాబిన్, రేచెల్‌గూటం నవదంపతుల గృహమునకు చేరుకొనిరి. 15వ తేదీ ఆదివారం బెంగుళూరులో యున్న అతి పెద్ద తెలుగు క్రీస్తుసంఘముతో కలసి ఆరాధన చేసిరి, మరియు వాక్యపరిచర్య చేసిరి. అక్కడను, బెంగుళూరులోని పలుప్రాంతములలోను చుక్కా జేకబ్‌గారు ప్రభువుకొరకు గొప్పపని చేయుచున్నారు. తదుపరి రిక్కీదంపతులు, రాబిన్ గూటం దంపతులు ఊటీ, మైసూరు పట్టణములు సందర్శించి, మైసూరులో ఒక ప్రభువు దినము గడిపిరి. రాబిన్ గూటం దంపతులు ఉద్యోగరీత్యా బెంగుళూరులో తాత్కాలికంగా యుండవలసివచ్చినందున వారిని ఆపట్టణములో విడిచి రిక్కీగూటం దంపతులు 25వ తేదీ బుధవారం నాటికి కాకినాడ సురక్షితముగా చేరుకొనిరి.

2015 మార్చి 21,22 శని ఆదివారములలో సికింద్రాబాదు, యాప్రాల్‌లో జరిగిన బైబిలు క్లాసులలో జాషువాగూటం దంపతులు పాల్గొనిరి 20వ తేదీ శుక్రవారం రాత్రి యాప్రాల్ క్రీస్తు సంఘసభ్యుడైన సోదరులు మనోజ్‌గారి యింటిలో జరిగిన గృహకూడికలో జాషువాదంపతులు పాల్గొనిరి. వాక్యపరిచర్య చేసిరి. వచ్చినవారందరు మంచి క్రైస్తవ సహవాస అనుభూతిని రుచి చూచిరి.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.o. Box -80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Mobile : 9848998547

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 35 | ఏప్రియల్ - 2015 | సంచిక - 9


## మోషేవంటి ప్రవక్త
## (A Prophet Like Unto Moses)

" నీ దేవుడైన యెహోవా నీ మధ్యను నావంటి యొక ప్రవక్తను నీ సహోదరులలో నీకొరకు పుట్టించును. ఈయన మాట నీవు వినవలెను" అని మోషే ఇశ్రాయేలీయులతో చెప్పెను (ద్వితీ 18:16). అతడట్లు చెప్పినపుడు వారికి క్రీస్తును సూచించెను. ఇశ్రాయేలీయులు ఐగుప్తులో బానిసలుగాయుండుట, మోషే నాయకత్వమును బట్టి వారు విడుదల పొందుట, వారు అరణ్య మార్గమున ప్రయాణించి వాగ్దానము చేయబడిన కానాను దేశములో చివరకు చేరుకొనుట యనునవన్నియును క్రీస్తు ద్వారా దేవుడు మానవుని పాపము నుంచి విముక్తునిగా చేయు పథకము యొక్క మాదిరి లేక ఛాయగా మనకు పాత నిబంధనలో కన్పడుచున్నవి. అందుకే "ఈ సంగతులు దృష్టాంతముగా వారికి సంభవించి, యుగాంతమందున్న మనకు బుద్ధి కలుగుటకై వ్రాయబడెనని" అపొ. పౌలు 1 కొరింథీ 10:11లో పలికెను.

ఈరోజు, యేసుక్రీస్తు యొక్క

ఛాయవలె పాత నిబంధనలో మోషే మనకెట్లు కన్పడుచున్నాడో చూచు కొందము. అతడు క్రీస్తును గూర్చి ప్రవచించుచు ఆయన 'నావంటి ప్రవక్త' అని పలికెను. గనుక క్రీస్తుకు మాదిరిగ మోషే జీవితము ఎట్లున్నదో తెలిసి కొందము. అయితే వీరిద్దరిలోను ఒక గొప్ప వ్యత్యాసమున్నది. మోషే కేవలము మానవుడు, యేసు అయితే దేవుని అద్వితీయ కుమారుడు, దేవుడు. అనేక విషయాల్లో మోషే బలహీనుడు, అసంపూర్ణుడు యేసు అయితే సంపూర్ణుడు ఆయన దైవమానవుడు.

మోషే యేసుక్రీస్తులు జన్మించినప్పుడు జరిగిన సంగతులను గమనించిన యెడల అవి యించుమించు ఒకేలాగున్నవి. మోషే జన్మించినప్పుడు ఇశ్రాయేలీయులకు పుట్టిన ప్రతి మగ శిశువు చంపివేయబడవలెనని ఐగుప్తుదేశపు రాజు ఆదేశించెను. అతడు మంత్రసానులతో "మీరు హెబ్రీ స్త్రీలకు మంత్రసాని పనిచేయుచు వారిని కాన్పుల పీటలమీద చూచినప్పుడు మగ వాడైన యెడల వానిని చంపుడి, ఆడుదైన యెడల దానిని బ్రదుకనియ్యుడని వారితో చెప్పెను" (నిర్గ 1:16). అయితే ఆమంత్రసానులు దేవునికి భయపడి ఐగుప్తురాజు తమ కాజ్ఞాపించినట్లు చేయక మగపిల్లలను బ్రదుకనియ్యగా, "ఫరో హెబ్రీయులలో పుట్టిన ప్రతి కుమారుని నదిలో పారవేయుడి, ప్రతి కుమార్తెను బ్రదుకనియ్యుడి అని తన జనులందరికి ఆజ్ఞాపించెను" (నిర్గమ 1:2?). ఈలోగా ఒక హెబ్రీ స్త్రీకి మోషే జన్మించెను. బాలుడు సుందరుడై యుండుట చూచి ఆమె వానిని మూడు నెలలు దాచెను. తరువాత ఆమె వానిని దాచలేక ఒక జమ్ముపెట్టె తీసుకొని అందులో ఆపిల్ల వానిని పెట్టి యేటి ఒడ్డున జమ్ములో దానిని ఉంచెను. ఫరో కుమార్తె స్నానముచేయుటకు ఆ ఏటికి వచ్చి పెట్టెలోని ఆపిల్లవానిని కనుగొని అతనిని తనకుమారునిగా పెంచుకొనెను. ఆమె అతనిని నీటిలో నుండి తీసెను గనుక అతనికి మోషే అను పేరు పెట్టెను.

యేసు జన్మించినప్పుడు యూదులకు రాజుగా ఉన్నవాడు పుట్టెనని హేరోదురాజు గ్రహించి బహు కలత జెంది బెత్లెహేములోను దాని సకల ప్రాంతములలోను రెండు సంవత్సరములు మొదలుకొని తక్కువ వయస్సు గల మగపిల్లలనందరిని వధించెను (లూకా 2:16). అయితే ప్రభువు దూత యేసేపుకు ప్రత్యక్షమై హేరోదు పసి బాలుడైన యేసును సంహరింపవలెనని

వెదుకుచున్నాడు గనుక నీవు లేచి ఆ శిశువును ఆయన తల్లిని వెంటబెట్టుకొని ఐగుప్తునకు పారిపొమ్మని తెలియజెప్పెను. హేరోదు చనిపోయిన తరువాత మరల యోసేపు, మరియలు యేసుతో సహా ఇశ్రాయేలు దేశమునకు తిరిగి వచ్చిరి. వారు నజరేతును ఊరికి వచ్చి అక్కడ కాపురముండిరి.

ఈ ఇద్దరి సందర్భములలోను వారు శిశువులుగా యున్నప్పుడు దేవుని యొక్క హస్తము వలన రక్షింపబడినట్లు మనము గ్రహించగలము.

మోషే యేసులు మానవులకు సేవ చేయుటకు అత్యున్నత స్థానములను విడనాడిరి. మోషే ఫరోరాజు భవనములో సమస్త సుఖసంపదలతోను, ధన ధాన్యములతోను, భోగ భాగ్యములతోను ఒక రాజకుమారునివలె పెరిగెను. అయితే "మోషే పెద్దవాడైనప్పుడు విశ్వాసమును బట్టి ఐగుప్తు ధనము కంటే క్రీస్తు విషయమైన నింద గొప్ప భాగ్యమని యెంచుకొని అల్పకాలము పాపభోగము అనుభవించుటకంటే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలుని యెంచుకొనెను" (హెబ్రీ 11:24-26). అతడు ఐగుప్తు దేశపు బానిసలగు ఇశ్రాయేలీయుల నాయకుడై వారికి పరిచర్యచేసి వారిని బానిసత్వము నుండి విడిపించెను.

యేసు ఆది నుండియు దేవుడై యుండెను. "ఆయన దేవునితో సమానముగా ఉండుట విడిచి పెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్నుతానే రిక్తునిగా చేసుకొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:6-8). ఆయన ధనవంతుడై యుండియు మనము తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలె నని మన నిమిత్తము దరిద్రుడాయెను (2 కొరింధి 8:9). సిలువపై తన పవిత్ర రక్తాన్ని చిందించెను. పాపపు బానిసలమైన మనలను పాపము నుండి విడిపించెను. మోషే ఇశ్రాయేలీయులకెట్లు పరిచర్య చేసెనో అట్లే క్రీస్తు పాపులకు పరిచర్య చేసి వారిని రక్షించుటకు లోకమునకు వచ్చెను.

మోషే తన ప్రజలను బానిసత్వము నుండి విడిపించుటకు ఏర్పరచబడెను.

వారు ఫరో ఆధిపత్యము క్రింద బానిసలై అణగద్రొక్కబడుచుండిరి. భరింపరాని భారములను ఫరో వారిపై మోపగా విమోచన కొరకు ఇశ్రాయేలీయులు దేవునికి మొరపెట్టిరి. దేవుడు మోషేను వారికి నాయకునిగా పంపించి, బానిసత్వపు సంకెళ్ళలో నుండి వారిని విడిపించెను. ఈ లోకమంతయు పాపపు సంకెళ్ళతో బంధింపబడి యుండగా క్రీస్తు వచ్చెను. మానవులను పాపము నుండి విడుదల చేయుటకు, అవినీతి నుండి నీతికి దాసులనుగా చేయుటకు ఆయన వచ్చెను. ఆయన మేలుచేయుచు ఈ భూమిపై సంచరించెను. పాప భారముతో మూలుగుచున్న వారిని చూచి "ప్రయాస పడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నాయొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని యేసు ప్రకటించెను (మత్తయి 11:28).

మోషే క్రీస్తులు ఇద్దరు ధర్మ శాస్త్రముల నిచ్చినవారే. సీనాయి కొండ మీద దేవుని ద్వారా ధర్మశాస్త్రమును పొంది మోషే దానిని ఇశ్రాయేలీయుల కిచ్చెను. దానినే మనము మోషే ధర్మ శాస్త్రము లేక పాత నిబంధన యని చెప్పుచూ యుంటాము. ఆ ధర్మశాస్త్ర మిచ్చుట ద్వారా యూదా జనాంగము లేక మోషే యుగము ఆరంభమయ్యెను. అది క్రీస్తు మృతులలో నుండి లేచిన తరువాత మొదటి పెంతెకోస్తు దినమున క్రీస్తు సంఘము స్థాపించబడు వరకు అమలులో యుండెను. అప్పటి నుండి క్రీస్తుయుగము ఆరంభమాయెను. క్రీస్తు మృతులలో నుండి లేచి పరలోక మందును భూమి మీదను నాకు సర్వాధికా మీయబడి యున్నది. కాబట్టి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి" యని పలికెను (మత్తయి 28:18,19). క్రీస్తు యిచ్చినచట్టమే క్రొత్త నిబంధన. ఆయన మోషే ధర్మ శాస్త్రమును సిలువకు మేకులతో కొట్టి వేసి (కొలస్స 2:14), దాని స్థానముననే క్రొత్త నిబంధన నిచ్చెను. మానవులందరు మోషే ధర్మ శాస్త్రమును బట్టిగాక క్రీస్తు యిచ్చిన సంపూర్ణ నియమమగు క్రొత్త నిబంధనను బట్టి నడుచుకొనవలెనని దేవుడు కోరుచున్నారు.

దేవుడు తన కాజ్ఞాపించిన వన్నిటిలోను మోషే దేవునికి విధేయుడై యుండెను. భూమి మీద నున్న వారం దరిలో అతడు మిక్కిలి సాత్వికుడు (సంఖ్యా 12:3). అట్లే యేసు దేవుని

కుమారుడైయుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను. అందువలన తనకు విధేయులైన వారి కందరికిని నిత్యరక్షణకు కారకుడాయెను (హెబ్రీ 5:8-10). మోషే వలెనె యేసు బహు సాత్వికుడు. అందుకే "నేను సాత్వికుడను, దీనమనసు గలవాడను గనుక మీమీద నాకాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును" అని ఆయన చెప్పెను (మత్తయి 11:29). మోషే ఇశ్రాయేలీయులకు గొప్ప సేవజేసెను. నలుబది సంవత్సరములు వారికి నాయకునిగా అతడు పనిచేసెను. వారికి త్రాగుటకు నీళ్ళు అవసరమైనప్పుడు ఒక బండలో నుండి నీళ్ళు రప్పించెను. ఆహారముగా దేవుని సహాయము వలన మన్నాను వారికి కురిపించెను. విషసర్పములతో వారు బాధపడుచున్నప్పుడొక ఇత్తడి సర్పమును వారి మధ్యను నిలబెట్టి వాటి నుండి వారిని రక్షించెను. యేసు కూడ రోగులను బాగు చేసెను. ఆకలి గొన్న వారికా హారము నిచ్చెను. దు:ఖములో నున్న వారిని ఓదార్చెను. పాపముచే కాటు వేయబడిన వారికి విరుగుడుగా సిలువపై ఆయన మరణించెను.

ఇశ్రాయేలీయులు ఐగుప్తును విడనాడినప్పుడు "వారందరును సముద్రములో నడచిపోయిరి, అందరును మోషేను బట్టి మేఘములోను, సముద్రములోను బాప్తిస్మము పొందిరి" అని వ్రాయబడి యున్నది (1కొరింథి 10:2). క్రీస్తునందున్న విశ్వాసి కూడ క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను. "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు" అని గలతీ 3:27లో వ్రాయబడియున్నది. ఇశ్రాయేలీయులను మోషే వాగ్దానము చేయబడిన కానానుకు నడిపించెను. క్రీస్తు ఆజ్ఞలకు విధేయులైన వారిని ఆయన పరలోక విశ్రాంతిలోనికి నడుపును. మోషే ఎంతఘనుడైనను అతడు క్రీస్తునకు ముందుగా వచ్చిన దాసుడు మాత్రమే. మన రక్షణ నిమిత్తము మనము మోషేను గాక ఇప్పుడు క్రీస్తును వినవలెను. క్రీస్తు సువార్తను నమ్మిబాప్తిస్మము పొందిన వాడు రక్షించబడును. నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని ఆయనే చెప్పుచున్నారు. అందుకే నీ పాపముల నుండి నీవు విముక్తుడవు కాగోరుచున్న యెడల ఈనాడే క్రీస్తును వెంబడించుము.

# ఇద్దరు కుమారులు
## (The Two Sons)
లూకా 21:28-32

**పరిచయము :**

ఈ ఉపమానము చెప్పక ముందు జరిగిన సంఘటనలు చురుకుగా జరిగి పోయెను. దానిముందు జరిగిపోయిన రెండు రోజులు, ఇది చెప్పబడే సమయము వరకు అన్నీ త్వరితముగా జరిగి పోయెను.

యేసు ప్రభువు సిలువవేయబడిన వారములో సోమవారం అది. దాని ముందు రోజు అదివారమున యేసు గొప్ప విజయోత్సాహముతో యెరూష లేములో ప్రవేశించెను. సోమవారం ఆయన దేవాలయములో ప్రవేశించి దాని ఆవరణములో అమ్ము వారిని కొను వారిని త్రోలి వేసెను. గ్రుడ్డివారిని, కుంటి వారిని ఆయన స్వస్థపరచెను. ప్రధాన యాజకులు, శాస్త్రులు దీనిని గమనించారు. చిన్నపిల్లలు "దావీదు కుమారునికి జయము" అని దేవాల యములో కేకలు వేసిరి. వీరు చెప్పు చున్నది వినుచున్నావా? యనివారాయన నడిగిరి. "బాలుర యొక్కయు చంటి పిల్లలయొక్కయు నోట స్తోత్రము సిద్ధింప జేసితిని అను మాట మీరు చదువ లేదా?" అని ఆయన వారితో చెప్పెను. అదే రోజున ఆయన నిష్ఫలమైన అంజూరపు చెట్టును శపించెను.

మంగళవారమున ప్రధాన యాజకులును పెద్దలును ఆయన యొద్దకు వచ్చి "ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? ఈ యధికారమెవడు నీకిచ్చెనని" ఆయనను సవాలు చేసిరి. ఏ అధికార మువలన నీవు రూకలు మార్చువారిని త్రోసి వేసావు? వారి బల్లలను పడ ద్రోసావు? గ్రుడ్డివారిని కుంటివారిని బాగుచేసావు? పిల్లలు నిన్ను దావీదు కుమారుడని పిలువ నిచ్చావు? అని ప్రశ్నించారు. ఇంకొక మాటలో ఈపనులు చేయుటకు నీకు అధికారము లేదనివారు వక్కాణించగోరారు. ఆయన చేసిన అద్భుతములను వారు చూసారు, నిజానికి వారి ప్రశ్నలో వారి దురభిమాన ద్వేషము, అసూయ, వేషధారణ, కపటత్వము దాగి యుండెను. ఇవ్విధముగా ప్రభువు యొక్క పరిచర్యలోని ఆఖరివారము

ఆరంభమాయెను. ఇట్టి సందర్భములో యేసు ఇద్దరు కుమారులను గూర్చిన ఉపమానమును ఉపదేశించారు. యేసు యొక్క అధికారమును ప్రశ్నించిన వారికి జవాబుగా ఆయన ఈ ఉపమానము చెప్పెను !

"మీకేమితోచుచున్నది? ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటివాని యొద్దకు వచ్చి -కుమారుడా, నేడు పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా వాడు పోను అని యుత్తర మిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొనిపోయెను. అతడు రెండవవాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు అయ్యా-పోదునని చెప్పెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్టప్రకారము చేసెనని వారిన డిగెను. అందుకు వారు మొదటివాడే అనిరి. యేసు-సుంకరులును వేశ్యలును మీకంటె ముందుగా దేవుని రాజ్యములో ప్రవేశించుదురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. యోహాను నీతిమార్గమున మీ యొద్దకు వచ్చెను. మీరతని నమ్మ లేదు; అయితే సుంకరులును వేశ్యలును అతనిని నమ్మిరి. మీరు అది చూచియు అతనిని నమ్మునట్లు పశ్చాత్తాప పడక పోతిరి" (మత్తయి 21:28-32).

ఇద్దరి కుమారుల ఉపమానము ద్వారా యేసును గద్దించడానికి వచ్చిన మత నాయకులును ఆయనే గద్దించారు. వారిని సంభాషణలో దింపి వారి మాటల తోనే వారిని ఖండించారు. భక్తి కలిగి యుంటేనే సరిపోదు. పరిసయ్యులు శాస్త్రులు ధర్మశాస్త్రమునందు ఆసక్తి కలిగినవారివలె నటించారు, గాని వారి మాటలు రెండవ కుమారుని విధేయతవలె యున్నవి. ప్రధాన యాజకులు పెద్దలు కూడ ఇట్టి వేషధారణతో కూడిన భక్తినే కలిగియుండిరి.

"వేషధారులారా- ఈప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారునన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" అని యేసు వారిని గూర్చి చెప్పెను (మత్తయి 15:7-9).

ఈ ఉపమానము ముఖ్యముగా రెండు రకాలైన యూదులకు వర్తించెను, రక్షింపబడేవారు రక్షణను నిరాకరించే వారు. ఈ రెండురకలైన యూదులు బాప్తిస్మమిచ్చు యోహాను బోధించే

సమయములో యుండిరి (మత్తయి 3:1-7). రెండోరకమైన యూదులు దేవాలయములో యేసును ప్రశ్నించారు గాని యోహాను యొక్క బాప్తిస్మమును గూర్చి యేసు అడిగిన ప్రశ్నకు జవాబిచ్చుటకు నిరాకరించిరి (మత్త 21:24-27). రెండవదిగా, ఇద్దరు కుమారులును గూర్చిన ఉపమానము యుక్తవయస్సుగల ప్రతివానికి వర్తించును, రక్షింపబడగోరే వారు, రక్షణను నిరాకరించేవారు.

మతగురువులు దేవుని వాక్యమును నిరాకరించారు. గాని నెలివేయబడినవారు దానిని అంగీకరించారు. బాప్తిస్మమిచ్చు యోహాను బోధకు యాజకులు, పెద్దలు చలించలేదు గాని పాపులైన అనేకులు మారుమనస్సు పొంది అతని వాక్యమును విన్నారు. రెండవ కుమారుడు పోదునని చెప్పాడు గాని పోలేదు. పరిసయ్యులు ఇట్టివారే. గాని నేనుపోను అని చెప్పి పిమ్మట మనస్సు మార్చుకొనిన మొదటి కుమారుని వలె మారుమనస్సు పొందిన పాపులు సుంకరులు యున్నారు.

ఈ ఉపమానములో తండ్రి పరలోక తండ్రిని పోలియున్నాడు. ద్రాక్షతోట యైతే ఆయన రాజ్యమైన సంఘము. కుమారులను ఆజ్ఞాపించే అధికారమును తండ్రి కలిగి యున్నాడు. ప్రతి కుమారుని ఆయన వెళ్లమని మాత్రమే చెప్పాడు. ఎందుకు? పనిచేయుటకు, ఎప్పుడు? నేడే, ఎక్కడికి? నా ద్రాక్ష తోటలోనికి. అదే రీతిగా మన పరలోక పుతండ్రి మనలను ఆజ్ఞాపించు అధికారముకలిగి యున్నారు. ఆయన వెళ్లుము అని ఆజ్ఞాపించుచున్నారు. ఎందుకు? శిష్యులుగా చేయుటకు, ఎప్పుడు? ఈరోజే (2 కొరింథీ 6:2; యోహాను 4:35). ఎక్కడికి? సర్వ లోకానికి (మార్కు 16:15-16). ఈ లోకం అంతా ఆయన ద్రాక్ష తోటయే. అది చాల విస్తీర్ణము గలది. కోత కాలము యిదే, గాని పనివారు కొద్ది మందియే.

ఈ ఉపమానములోని మొదటి కుమారుడు తమకు రక్షణ అవుసరమని ఎరిగిన ప్రజలవలె యున్నాడు. ఆహ్వానించబడినప్పుడు వారు మారు మనస్సు పొంది ఆయన రాజ్యములో ప్రవేశించి పనిచేయుదురు. రెండవ కుమారుడు తమ పాపముల విషయమై గ్రుడ్డివారైన యూదులను సూచించు చున్నాడు. మారుమనస్సు పొంద వలెనని పిలువబడగా వారు అభ్యంతర

పడిరి. అందువలన వారు మిమోచన కర్తలో ఆసక్తిని యేమీ కనుబరచలేదు. సరిగదా ఆయనను నాశనము చేయ జూచారు.

దేవుని పిలుపు సార్వ...నికమైనది. అది అత్యవసర ఆహ్వానము. తండ్రి తన యిద్దరు కుమారులకు ఒకే రకమైన ఆజ్ఞను యిచ్చాడు. విధేయత చూప వలసిన ఆజ్ఞలు అందరికీ సమానమే (మార్కు 16:15-16; అపొ.కా. 2:38; 17:30). తండ్రికి ఉన్నా కుమారులు యిద్దరే. ఆయన వారిద్దరనీ ఆజ్ఞా పించాడు. దేవుని పిలుపు అందరికీ, అయితే అందరు సత్యమునకు విధేయు లు కారు. యూదా మత గురువుల కంటే ముందుగా సుంకరులు, పాపులు వేశ్యలు సత్యమును గ్రహించి అంగీకరించారు. గనుక వారే దేవుని రాజ్యములో ముందు ప్రవేశించారు (యోహాను 9:39-41).

ఈ యిద్దరి కుమారులు ఉపమానము బైబిలు సంబంధమైన మారుమనస్సును గూర్చి కూడ బోధిం చుచున్నది. యూదులు మారుమనస్సు పొందాలని బాప్తిస్మమిచ్చు యోహాను బోధించాడు. "మారుమనస్సుకు తగిన ఫలములను ఫలించుడి" యని హెచ్చ రించాడు (మత్తయి 3:8).

మారుమనస్సు అనగా యేమిటి? అది తండ్రి మాటను కాదనినందుకు కలిగిన దు:ఖము మాత్రమే కాదు. మారుమనస్సు పొందకుండా అతను ఆలాగే దు:ఖించుచుండవచ్చును. గాని అతడిప్పుడు మారుమనస్సు పొందాడు! అతడు మనస్సు మార్చుకొని, పోయి ద్రాక్ష తోటలో పనిచేసినప్పుడు. క్రియలులేని మాటలు వ్యర్థము (యాకోబు 1:22, లూకా 6:46).

**ముగింపు :**

ఇద్దరు కుమారులకు ఉన్న తండ్రి ఒక్కడే, వారికీయబడిన ఆజ్ఞలుసమానమే, తరుణములు ఒక్కటే, బాధ్యతలు సమానమే. ఆశీర్వాదములు సమానమే.

దేవుడు ఆదాము హవ్వలను ఏదెనువనములో యుంచినపుడు వారికి చేయుటకు పని అప్పగించెను (ఆదికా 2:15). మన కుటుంబ సంరక్షణ కొరకు కష్టపడి పనిచేయాలి (2 థెస్స 3:10). క్రైస్తవులు సంఘములో చురుకుగా పనిచేయాలని దేవుడు కోరుచున్నారు (1కొరింథీ 15:58; యాకో 2:20, 24,26). దేవుని బిడ్డలు ఆయన రాజ్యములో పనిచేయాలి.

- లూయి రష్మోర్

## దహన బలి యొక్క విధి విధానములు -1
## (The Rituals of the Burnt offering)

### దేవుని బల్యర్పణ పద్ధతి -7

దహన బలి యొక్క విధి విధానములో ఈ బలులలో యున్న భక్తి విశ్వాసములు ఒక స్థాయినుండి మరొక స్థాయికి చేరుకొనుట చూడగలము. ప్రతి అర్పణలోను అచరించవలసిన ప్రత్యేక విధానములున్నవి. ఈ అచారకర్మలలో వివిధస్థాయిలను మనం కనుగొనగలము. ఈ విధానములో యున్న ప్రతి క్రియలో కూడ గొప్ప ఆత్మీయ పాఠములున్నవి. హెబ్రీయులు వాటిని నేర్చుకొనవలసి యున్నది.

**వివిధ స్థాయిలు :**

దహనబలి అర్పించుటలో నాలుగు స్థాయిలు మనకుకన్పడును. నిజానికి ఎనిమిదివున్నవి. ముందు మొదటి నాలుగు స్థాయిలను పరీక్షింతము. ఇవన్నియు ఆరాధించేవాడు, యాజకుడు కూడ చేసే వివిధపనులు. ప్రతి క్రియ ఒక ప్రత్యేకమైన వర్తమానమును అందించును.

మొదటి దశ - ఆరాధించేవాడు తనను, తనకు బదులుగా తెచ్చిన పశువును దేవునికి సమర్పించును. అప్పటినుండి ఆ పశువు దేవునికి చెందును.

రెండవ దశ - ఆరాధించేవాడు తన చేతిని బలిపశువు తల మీద ఉంచును. అతని స్థానములో అది అర్పింపబడుచున్నది.

**మూడవ దశ** - ఆరాధించే వాడు ఆ బలిపశువును వధించును.

**నాల్గవ దశ** - వధింపబడిన బలి పశువు యొక్క రక్తమును యాజకుడు చెప్ప బడిన రీతిగా బలిపీఠముచుట్టు దానిని ప్రోక్షించును (లేవీ 1:3-6).

**సమర్పణ :**

దహనబలి అర్పించువాడు బలిపశువును ప్రత్యక్షగుడారము యొక్క ద్వారమునకు తీసికొని వచ్చి దేవునికి సమర్పించును. అతడు తనను, తన బలిని దేవునికి సమర్పించుకొనును. అతడు బలిపీఠము యొద్ద నిలబడి "దేవా ఈ పశువును నాకు ప్రతిగా నీకు సమర్పించుచున్నాను. నన్ను నేను నీకు సమర్పించుకొనుచున్నానని" తన కోరికను దేవునికి వ్యక్తపరచును.

ఆక్షణం నుంచి అది దేవునికియ్యబడినది గనుక అది దేవునికి చెందినది. అది ఇక మీదట ఆరాధించే వాని పశువు కాదు. అతడు దానిని తనమందలు నుండి తీసికొని వచ్చాడు. దేవునికి అర్పించకముందు అది తనదే గాని ఈ క్షణంనుండి అది దేవునిది. గనుక ఈ సందర్భములో ఆరాధకుడు తనకుగాతానును, తన అర్పణను

దేవునికి సంపూర్తిగ సమర్పించును.

అట్లు సమర్పించిన తరువాత అతడు అక్కడ నుండి నిష్క్రమించడు. ఏలయనగా ఆ బలియర్పణలో అతడు ఇంకా నిమగ్నుడైయున్నాడు. ఆబలి విషయమైన సంగతులను గూర్చి ధ్యానించుచు మనస్పూర్తిగా ఆ అర్పణలో నిమగ్నుడై యున్నాడు. దేవుని యెడల తన కున్న ప్రేమను గూర్చి ఆలోచిస్తు తన యొక్క భక్తి శ్రద్ధలను కోరుటలో దేవుని కున్న హక్కును గూర్చి ఆలోచించుచు యున్నాడు.

తలపై చెయ్యి ఉంచుట :

తన అర్పణలో ఇప్పుడు రెండవ దశ: అతడు అర్పించిన పశువు తల మీద తన చెయ్యి ఉంచును. ఆపశువు నాది అని చెప్పుటకు గాక, అది దేవునిదని చెప్పుటకు అతడు దాని తలమీద తన చెయ్యి ఉంచును. మరిముఖ్యముగా ఆ పశువు అతనికి బదులుగా అర్పింప బడుచున్నదని అతడు తలంచును. ఆపశు వుకు ఒక ప్రత్యేకత అప్పగింపబడు చున్నది. రక్తబలులన్నిటి విషయములోను యిది సాధారణము యూదుడు వ్యక్తి గతముగా బలి అర్పించినా, యాజకుడు ఇశ్రాయేలు జనాంగము దరపున పరి హారదినమున అర్పించినా బలిపశువు తలపై చేతులుంచుట జరుగవలెను.

తలపై చెయ్యి ఉంచు క్రియ ద్వారా ఒక ప్రత్యేక ప్రయోజనము కొరకు ఆపశు వును నియమించుట జరుగును. అది ఒక ప్రత్యేక పనిని జరిగించును. లేవీ 24:14లో చేతులుంచే ఒక ఉదాహరణ యున్నది. ఒకడు శాపవచనములు పలుకుట వలన అపరాధి అయితే, యెహోవా నామమును దూషించిన వాని మాటలను మొదట విన్నవాడు అతని తల మీద చేతులుంచిన తరువాత, వాని శాపవచనమును విన్నవారందరు వానితల మీద చేతులుంచగా సర్వ సమాజము వానిని రాళ్లతో చావగొట్టవలెను. అతడు చేసిన అపరాధమును వారు అతని తలపైకే మార్చిరి.

తల మీద చేతులుంచేమరొక ఉదాహరణ సంఖ్యా 27:23లో మనకు కనబడును. మోషే యెహోషువను తన యొద్దకు పిలిచాడు. అతడు యెహోషువను సర్వమాజము ఎదుట నిలువబెట్టి అతని మీద చేతులుంచి ఇశ్రాయేలు నాయ కత్వమును యెహోషువకు బదలా యించాడు ఏలయనగా మోషే చనిపో బోవుచున్నాడు.

తలపై చేతులుంచే మూడవ సందర్భము, ఒకరికి బదులుగా ఇంకొక రుంచబడుట నిత్యము మనకు కనబడుచు యుంటాది. ఇశ్రాయేలీయుల అన్ని గోత్రముల వారి ప్రధమ సంతానమునకు బదులుగా లేవీయులు ఆస్థానములో

యుందురు. ఏగోత్రములో జన్మించినా జ్యేష్టకుమారుడైన వాని తండ్రి అతనిని ప్రత్యక్షగుడారమునొద్దకు తెచ్చును. లేవీ కుమారుడొకడు అదే సమయమున కొనితేబడును. జ్యేష్ట కుమారులందరు దేవునికి చెందుదురు (నిర్గమ 13:2,12). గాని లేవి వంశస్థులు మిగతా వారికి బదులుగా యుండుటకు దేవుడు అనుమతి నిచ్చెను గనుక ఒకని తండ్రి లేవీ కుమారుని తలపై చేయివుంచును. ఆ లేవి కుమారుడు తన కుమారుని స్థానములో యుండును.

అపరాధపరిహారార్ధ దినమున అహరోను అజాజేలు అను నామకరణము చేయబడిన మేక తల మీద తన రెండు చేతులుంచును. అజాజేలు అనగా విడిచి పెట్టే మేకయని అర్ధము (లేవీ 16:5-9). అహరోను విడిచిపెట్టే మేక తలమీద తన రెండు చేతులుంచి ఇశ్రాయేలీయుల పాపములన్నియు దానిమీద ఒప్పుకొని, ఆమేక తలమీద వాటిని మోపి తగిన మనుష్యుని చేత అరణ్యములోనికి దాని పంపవలెను (లేవీ 16:20-21). ఈ రీతిగా వారిపాపములన్నియు సూచన ప్రాయముగా వారి పాళెము నుండి నిర్మూలించబడెను.

గనుక దహనబలియర్పణలో ఆరాధించువాడు తన చేతిని బలిపశువుపై యుంచినప్పుడు అతడు తన పాపములను సూచనప్రాయముగా ఆజంతువు మీద మోపియున్నాడు. ఆరాధించువాని పాపముల నిమిత్తము ఆపశువు అతని స్థానములో చావవలసి యున్నది.

**బలిపశువును వధించుట :**

ఈ బలియర్పణల మూడవ దశలో బలి పశువును వధించుట జరుగును - ఆరాధించువాడే తనకు బదులుగా యున్న పశువును వధించ వలెను. దానిని వధించుట ద్వారా అతడు తనపాపములను ఒప్పుకొనును. అతనికి బదులుగా అర్పింపబడుచున్న పశువు ద్వారా తన పాపముల క్షమాపణ లభించినందున అతడు దేవునికి తన కృతజ్ఞతను తెలియజేయును. అతడు తనకు బదులుగా యున్న పశువును వధించవలెను. వధించుట అను ఈ మాట 'shahat' అనే హెబ్రీపదము వర్ణించు చున్నది. shahat అనగా హత్య చేయుట కాదుగాని బల్యర్పణలో జరుగు వధ. హత్యకు, బల్యర్పణ వధకు వేర్వేరు మాటలు హెబ్రీభాషలో వాడబడినవి. ఆరాధించువాడు తన చేతులతోనే తాను అర్పించుచున్న పశువును వధించవలెను. తనకుబదులుగా అర్పింపబడుచున్న దాని మరణమునకు అతడు బాధ్యుడని అతడు గుర్తించాలి. పాపమువలన కలుగు ఘోరపర్యవసానాన్ని అతడు తెలుసుకోవాలి. ఆ జంతువు యొక్క

ప్రాణం అతని ప్రాణమునకు బదులుగా అర్పింవబడుచున్నది. నిజానికి చావలసిన వాడు అతడే గనుక దేవుని కరుణా కటాక్షములను, కృపను అతడు ఇప్పుడు గుర్తించును. అతనికి బదులుగా అతని స్థానములో ఆ పశువు వధింప బడుటకు దేవుడు అనుమతినిచ్చారు.

ఈ రీతిగా హెబ్రీయుడు తనకు బదులుగా యున్న పశువును చంపేవాడు. పాపమునకు వ్యతిరేకముగా యున్న దేవుని శిక్షను అతడు అమలు పరచుట చేత, తన సొంతపాపముల యెడల కలుగు దేవుని తీర్పుతో అతడు ఏకీభవింప బాధ్యుడు. "పాపము చేయువాడే మరణము నొందును" అని ధర్మశాస్త్రము చెప్పుచున్నది. పాపము యెడల దేవుని తీర్పును అంగీకరించువాడు. అపరాధము జరిగించు వాడెవడైనను మరణమునకు పాత్రుడని అంగీకరించును. ఈ రీతిగా కూడ హెబ్రీయుడు పాపము యెడల మరణించువాడగును. ఇంకొక మాటలో, "నాపాపమును నేను అసహ్యించుకొను చున్నాను, దానిని చంపుదును, దానిని నాశనము చేతునని" తనలో తాను చెప్పుకొనును.

క్రైస్తవులు కూడ యిదే పనిని చేయు చున్నారనునది విదితమే. ఏలయనగా క్రైస్తవులు పాపము విషయమై మృతి జెందినవారు. వారు తమ అపరాధమును యేసుక్రీస్తుకు బదిలీ చేయుదురు. హెబ్రీయుడు తన బలిపశువును యెహోవా సన్నిధిని వధించును (లేవీ 1:5). ఏలయనగా ఒకడు దేవునికి వ్యతిరేకముగా చేసిన పాపముకు పరిహారార్థముగా ఈ అర్పణ పనిచేసెను. దేవుని యెడల అతడుస్థిరముగా లేనందున పాపము అతనిలో ప్రవేశించెను. దేవుని అతిపరిశుద్ధమైన చట్టము ఎల్లవేళలా గౌరవింపబడవలెను.

ఈ రీతిగా యూదుడు తానర్పించే బలిపై తన చేతులతో పనిచేయును. క్రీస్తుతో మనకు గల సంబంధము విషయమై అపో. పేతురు ఇంచుమించు యిదే సంగతిని తెలియజేయుచున్నాడు. "దేవుడు నిశ్చయించిన సంకల్పమును, ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టుల చేత సిలువవేయించి చంపితిరి" (అపొ.కా. 2:23). యేసుక్రీస్తును సిలువకు మేకులతో కొట్టించినది మనపాపములే (1పేతురు 2:4). మనమాయన మరణమును అంగీకరించిన యెడల, మనపాపముల విషయమై దేవుని తీర్పును కూడ అంగీకరించాలి.

# పవిత్ర అపవిత్ర జంతువులు
## (Clean and Unclean Animals)

"దేవుడు – ఇదిగో భూమి మీద నున్న విత్తనములిచ్చు ప్రతి చెట్టును విత్తనము నిచ్చు వృక్షఫలము గల ప్రతి వృక్షమును మీకిచ్చి యున్నాను; అవి మీ కాహారమగును. భూమి మీద నుండు జంతువులన్నిటికిని, ఆకాశ పక్షులన్నిటికిని భూమి మీద ప్రాకు సమస్త జీవులకును పచ్చని చెట్లన్నియు ఆహారమగునని పలికెను. ఆప్రకార మాయెను" (ఆది.కా. 1:29–30).

"ప్రాణముగల సమస్త చరములు మీకాహారమగును పచ్చని కూర మొక్కల నిచ్చినట్లు వాటిని మీకిచ్చి యున్నానని" ఆది 9:3లో ఆయన చెప్పెను. ఆది.కా. 1:29 ని బట్టియు 9:3ను బట్టియు సృష్టిజరిగిన నాటి నుండి జలప్రళయము వరకు మానవులు భూఫలములనే భుజించినట్లును, జల ప్రళయము తరువాత మాంసాహారము భుజించుటకు అతనికి అనుమతి ఇయ్యబడెననియు అనేకులు తలంతురు.

నోవహుకాలము నుండి పవిత్ర జంతువులు, అపవిత్రజంతువుల మధ్య యున్న ప్రత్యేకత తెలియజేయబడినది (ఆది.కా 7:2). బహుశ బలియర్పణ నిమిత్తము ఆ తేడా తెలియజేయబడి యున్నది. అయితే పవిత్ర అపవిత్ర జంతువుల మధ్యనున్న వ్యత్యాసము మోషే ధర్మశాస్త్రములో మరింత స్పష్టముగ విశదీకరించబడెను. క్లుప్తముగా చెప్పాలంటే యూదులు డెక్కలు గలదై నెమరు వేయు జంతువులను తినవచ్చును. ఉదా: దూడలు, గొర్రెలు, లేడి మొదలగునవి తిన వచ్చును గాని ఒంటె, పంది, పొట్టి కుందేలు మొదలగునవి (లేవీకా. 11 అధ్యా ; ద్వితియో 14). జల చరముల లో వేటికి రెక్కలు పొలుసులు ఉండునో వాటిని తినవచ్చును, వేటికి రెక్కలు పొలుసులు ఉండవో అవి తినకూడదు. మాంసము భక్షించని పక్షులను తిన వచ్చును. మిడతలు వగయిరా తిన వచ్చును.

యూదులకు ఆహార విషయము లో మరికొన్ని నిషేధములున్నవి. నిర్గమ 22:31; 23:19; 29:13–22; 34:15, లేవీ 17:10 లను దయచేసి చదువండి. ఇట్టి నిషేధములన్నియు

ఇశ్రాయేలీయులను దేవునికి ప్రతిష్ఠిత జనముగా చేయుటకు ఉద్దేశించ బడినవి. "ఏలయనగా నీ దేవుడైన యెహోవాకు నీవు ప్రతిష్టత జనము అని దేవుడు ఇశ్రాయేలీయులకు తెలియజేసారు (ద్వితీ 14:21). మరియు ఈ నిషేధాజ్ఞలలో వారి యొక్క ఆరోగ్యము భద్రము చేయబడి యుండెను.

తదువరి క్రొత్త నిబంధన కాలము లో మోషే కాలమునాటి పవిత్ర అపవిత్ర జంతువుల సంబంధమైన నిషేధాజ్ఞలు ఎత్తివేయబడెను. యేసుక్రీస్తు ఆయన రాజ్యావిష్కరణ మును మననప్పలోనుంచు కొని "వెలుపలినుండి లోపలికి పోయి మనుష్యుని అపవిత్రునిగా చేయగలుగు నది ఏదియు లేదుగాని లోపలినుండి బయలువెళ్లునవే మనుష్యుని అపవిత్రునిగా చేయుననెను"(మార్కు 7:15-16). "లోపలినుండి అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును, జారత్వములను దొంగతనములును నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడు తనములును కృత్రిమమును కామ వికారమును మత్సరమును దేవ దూషణయు అహంభావమును అవి వేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలు వెళ్లి మనుష్యుని అపవిత్రపరచునని ఆయన చెప్పెను" (మార్కు 7:21-23).

నిషేధింపబడిన జంతువులు పవిత్రపరచబడినట్లు తెలియజేయుట కును, అన్యజనులికమీదట అపవిత్ర జనాంగముకారనునది తెలియజేయుటకు ప్రభువు పేతురుకు ఒక దర్శనము ననుగ్రహించెను (అపొ.కా. 10:9-16). మోషే ధర్మశాస్త్రము ఎత్తివేయబడినందున అన్నపానముల విషయములో ఎవడును ఇప్పుడు తీర్పుతీర్చనక్కర్లేదని పౌలు తెలియ జేసాడు (కొలస్స 2:14-16). సరిగదా దేవుడు సృజించిన ఆహారవస్తువు లను తినుటకు నిషేధించుట విశ్వాస భ్రష్టత్వమని అతడు తెలియజేసాడు (1తిమో 4:1-4).

- వేయిన్ జేక్సన్

# క్రీస్తు తనను గూర్చి చెప్పుకొనేది ఆలోచింతము
## (Considering Christ's Claims)

యేసు ఎవరో నేనెందుకు గమనించాలి? దీన్ని గూర్చి ఎన్నడైనా నీవాలోచించావా? నీవు ఆయనను గూర్చి రేడియోలోగాని, టి.వీలోగాని వినియుండవచ్చును. ఆయనను గూర్చి పలు చోట్ల చదివి యుండవచ్చును. చివరకు, యేసును గూర్చి నేనెందుకు ఆలోచించాలి? ఆయనతో నాకేంటి సంబంధము? అని బహుశ నీవనుకొనుచుండవచ్చును.

నిజానికి, యేసు తన్ను గూర్చి కొన్ని గొప్ప సంగతులు చెప్పారు. ఆయన చెప్పిన వన్నీ ఎంత అసాధారణమైనవంటే వాటిని విన్నావాడు ఆయనను అయితే అంగీకరిస్తాడు లేదా నిరాకరిస్తాడు. నిజానికి ఆయన తన్ను గూర్చి చెప్పుకొన్న వాటిని గూర్చి మనమెందుకు ఆలోచించాలి? ఎందుకు ? ఎందుకు ?

యేసు తన్ను గూర్చి యేమి చెప్పుకొన్నారో వినుము. బైబిలులో ఒక చోట యేసును ఎరుగుట దేవుని ఎరుగుటయే యని ఆయన చెప్పారు (యోహాను 8:19). తదుపరి యేసును చూచిన వాడు దేవుని చూచినట్లేయని ఆయన చెప్పారు (యోహాను 12:44). వేరొకచోట యేసును అంగీకరిస్తే దేవుని అంగీకరించినట్లే యున్నారు (మార్కు 19:37). మరియు ఇంకొకచోట యేసును ద్వేషిస్తే దేవుని ద్వేషించినట్లేయని అన్నారు (యోహాను 15:33). చివరిగా యేసును ఘనపరిస్తే దేవుని ఘన పరచినట్లే యన్నారు (యోహాను 5:23). ఇంకొక మాటలో యేసు కేమైనా చేస్తే అది దేవునికి చేసినట్లే యని ఆయన వక్కాణించారు. తండ్రియైన దేవునితో ఆయనకున్న ఏకైక సంబంధమును బట్టి ఆయన తన్ను గూర్చి చెప్పుకొనిన ఆరోపణలున్నవి.

మీరు నేనుకూడ అపనమ్మక యుగంలో జీవించుచున్నాము. కంటికి కనబడు ఈ ప్రపంచము, మన ఆలోచనలను జీవనసరళిని కంట్రోలు చేస్తు దేవుని యొక్క విలువలను గాక స్వార్థపరమైన, ఘర్షణ పూరితమైన వాతావరణమును మనముందు ఉంచుచున్నది. విశ్వాసము యొక్క విలువలను మనముగ్రహించ లేక యున్నాము. నిజమే మనలో కొంత మంది దేవుని యందు ఒక రకమైన విశ్వాసము కలిగిన వారున్నారు. అయినను నజరేతువాడైన యేసును దేవునిగా అంగీకరించుటకు

సంశయిస్తున్నారు. గనుక భూమిపై యేసును దేవుడని విశ్వసించుటకు నిరాకరించువారనేకులున్నారు.

బైబిలులో తోమా అను ఒక మనుష్యుడున్నాడు. అతనికి సంశయించు తోమాయనే పేరు కలదు. యేసు చని పోయి తిరిగి లేచారని అతనికి తెలియ జెప్పగానే అతడు "నేనాయన చేతులలో మేకులగురుతును చూచి నా వ్రేలు ఆమేకుల గురుతులో పెట్టి నాచెయ్యి ఆయన ప్రక్కలో ఉంచితేనే గాని నమ్మనే నమ్మనని వారితో చెప్పెను" (యోహాను 20:25). గనుక మన అవిశ్వాస ప్రపంచములో తోమాతో కలిసి యేసు జన్మించినట్లు నాకు నిరూపించుము, ఆయన సిలువవేయబడి తిరిగిలేచినట్లు నాకునిరూపించుము అని చెప్పు చున్నాము.

ఈయన నిజానికి ఎన్నడైనా జీవించారా ? చెప్పాలంటే ఆయన జీవించినట్లు చెప్పడానికి అనేక రుజువు లున్నాయి. ఉదాహరణకు బైబిలు చెప్పు చరిత్రాత్మక సంగతులన్నియు ఎంతో యదార్థము. వాటిని ఎవరు కాదనలేరు. యేసు కాలమునాటి రాజకీయ వ్యక్తులు, సమకాలీన సంఘటనలు బైబిలులో యున్నట్లు నూటికి నూరుపాళ్ళు యదార్థము. రోమా చక్రవర్తియైన కైసరు ఔగుస్తు ప్రజాసంఖ్య వ్రాయవ లెనని ఆజ్ఞాపించెను. ఇది కురేనియ సిరియా దేశమునకు అధిపతియై యున్న ప్పుడు జరిగిన మొదటి ప్రజాసంఖ్య. యోసేపు బేత్లెహేముకు తప్పకవెళ్లవలెను.

అది దావీదు పట్టణము. తన కుటుంబమును ఆ ప్రజాసంఖ్యలో వ్రాయించుటకతడు అక్కడకు తప్పక వెళ్లవలెను. తాను, మరియ అక్కడ ఉండగా యేసు జన్మించెను.

మరల యేసు కంటె ముందుగా వచ్చిన వారి దంతము కూడ యున్నది. ఆయన యొక్క దూత, మార్గ సరాళ మార్గదర్శియైన బాప్తిస్మమిచ్చు యోహాను కూడ ఈ చారిత్రాత్మక సంఘటనలలో యున్నాడు. తదుపరి యేసు యొక్క బోధలను గూర్చియు, పనులను గూర్చియు బోలెడంత సాక్ష్యమున్నది. ఆయన జీవిత చరిత్రను, నాలుగు గ్రంధకర్తలు, ఆయన ఎక్కడకు వెళ్లాడో, యేమి చేసాడో, యేమి బోధించాడో అన్నీ వ్రాసారు. వారి వ్రాతలు ఏకీభవిస్తున్నాయి. ఆయన మరణమును గూర్చి, అది పస్కానాడు జరిగిన సంఘట నను గూర్చి, అప్పుడున్న ప్రధాన యాజ కుని గూర్చిన చారిత్రాత్మక వాస్తవములెన్నో యున్నాయి. అట్లే ఆయన పునరుత్థానము ను గూర్చి కూడ అనేకరుజువులున్నాయి. వాటిని ఎవరు కాదనలేరు. నిజానికి యేసును దేవుడు కాదని చెప్పేవారెవడు ఈనాడు ఉండకూడదు. -లేరీ వెస్ట్

# యెహోవాకు అసహ్యమైన ఏడుసంగతులు
## (Seven things the Lord Hates)

పరిచయము : సామెతలు 6:16-19

దేవుడు అసహ్యించుకొనునని నీవెరుగుదువా? ఆయన ప్రేమించగలరు, ద్వేషించగలరు కూడ.

హేయమైన దానిని గూర్చిన ప్రగాఢ మైన అయిష్టత - అసహ్యము. దేవుడు అసహ్యించుకొనేవి ఏడుకంటే ఎక్కువ ఉండవచ్చును గాని ఏడు అనే సంఖ్య పరిపూర్ణత్వాన్ని సూచించడానికి వాడ బడింది. ఇక్కడ చెప్పబడిన ఏడు సంగతులు దేవుడు అసహ్యించుకొనే నీచమైన సంగతులు.

దేవుడు అసహ్యించుకొను చున్నట్లయితే, వాటిని గూర్చిన మన తలంపులు ఎట్లుండాలి ?

**1) అహంకార దృష్టి :**

ఇతరుల కంటే తన్ను తానే గొప్పగా ఎంచుకొనుట, గర్వముతో కూడిన ప్రవర్తన, స్వార్ధపరత్వము.

అహంకారము ఒక దుష్టలక్షణము వలె లేఖనములు వర్ణించుచున్నవి. 2 తిమోతి 3:2; యాకోబు 4:6, 1 పేతురు 5:5. మనం సాత్వికులమై దీనమనస్సు కలిగి యుండాలని బైబిలు చెప్పుచున్నది.

**2) కల్లలాడు నాలుక :**

మోసగించడానికి, పెడద్రోవను పట్టించడానికి అబద్ధము చెప్పుట. కొన్ని జనాంగములలో అబద్ధం పలకడం ఆశ్చర్యం. అదొక పరిపాటి.

అబద్ధికులందరు మండుచున్న అగ్ని గుండములో పడద్రోయబడుదురని బైబిలు చెప్పుచున్నది (ప్రకటన 21:8).

అబద్ధికులకు తీవ్రమైన తీర్పు చెప్పబడినది. సత్యము నాశనం చేయబడినప్పుడు, సత్యసంబంధాలను నెలకొల్పే ఆధారం యేమీ వుండదు.

అబద్దానికి వ్యతిరేకపదం సత్యం; నిష్కాపట్యము, యదార్ధత, నమ్మకత్వము.

దేవుని వాక్యమే సత్యము (యోహాను 17:17). సత్యమే మనలను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32).

**3) దుర్యోచనలు యోచించు హృదయము:**

ఇట్టిది దుష్ట హృదయం. ఎల్ల వేళలా కుట్రపన్నుచునే యుండును. అన్నివేళలా కీడును సంకల్పించే హృదయం (మత్తయి 5:19-20). దేవుడు శుద్ధ హృదయాన్ని కోరుచున్నారు (మత్త 5:8).

**4) నిరపరాధులను చంపు చేతులు :**

యిది పగ తీర్చుకొనుటకు చేయు హింస.

యుద్ధములో జరిగేది యిదే.

యిది శరీర కార్యము (గలతీ 5:21). నరహంతకులు నరకములో పడవేయబడుదురు (ప్రక 21:8).

**5. కీడు చేయుటకు పరుగులెత్తు పాదములు :**

శాంతిని భంగపరుచుటకు, యితరులకు హానిచేయుటకు, అమాయకులను హింసించుటకు పరుగు లెత్తుట. మనం సమాధానపరచు [illegible]రిగ యుండాలి (మత్తయి 5:9).

**6. లేనివాటిని పలుకు అబద్ధసాక్షి :**

చట్టరీత్యా సాక్షియైన వాడు బుద్ధి పూర్వకముగా అబద్ధ సాక్ష్యము చెప్పువాడు

అబద్ధసాక్షి పదియాజ్ఞలలో నొక దానిని ఉల్లంఘించువాడు (నిర్గమ 20:10).

యిట్టి పాపము హృదయములో నుండియే వచ్చునని క్రీస్తు చెప్పెను (మత్తయి 15:19-20).

దేవుని ప్రజలుగా యుండాలంటే మనమాటను నిలబెట్టుకోవాలి (మత్త 5:37).

7) అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడు:

ఇట్టివాడు విభేదములను, కలహములను, ఘర్షణలను పుట్టించును

క్రైస్తవులందరు ఏకమై యుండాలని క్రీస్తు ప్రార్థించెను (యోహా 17:20-21).

సహోదరులలో కక్షలుండకూడదు (1 కొరింథీ 1:10).

భేదములను పుట్టించువానిని కనిపెట్టుకొనియుండాలి (రోమా 16: 17-18).

**ముగింపు :**

1) దేవుడు పై సంగతులను అసహ్యించుకొనుచున్న యెడల వాటిని జరిగించువారు దేవునికి వ్యతిరేకులు.

2) ఇట్టి దుష్టలక్షణములనుండి మనం విడుదల పొందాలి. వాటిని అసహ్యించుకోవాలి.

- జె.సి. ఛోట్

## పాపము యొక్క భయంకర మూల్యము

## (The High Cost of Sin)

నైతిక విలువలు పతనమైపోయిన ఈలోకములో దుర్మార్గులకు న్యాయ సంబంధమైన శిక్ష పడకుండా వారి 'న్యాయవాదులు' తీవ్రముగా పని చేయుదురు. అందువలన అనేకులు దుష్కార్యము చేయుటకే సంకల్పించుచున్నారు. 'దుష్ క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగక పోవుట చూచి

మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్ క్రియలు చేయుదురు" (ప్రసంగి 8:11).

మనం అస్థిరసముద్రములో కొట్టు మిట్టాడుచున్నాము. ప్రతిదినము ఎవరో ఒకరు హత్య గావించబడుచున్నారు, ఏక్సిడెంట్‌లో చనిపోవుచున్నారు; గృహంలో శాంతి లేక హింసాత్మక మార్గమును ఎంచుకొనుచున్నారు. తమ విధులకు హాజరు కాకుండా సెలవు దినముల నెక్కువకోరుకొనుచున్నారు. వారిని హెచ్చరించు వారి మీదికి తిరుగుబాటు చేయుచున్నారు. "మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్పూర్తిగా చేయుడి" (కొలస్స 3:22-25) అని బైబిలు బోధించు చున్నది.

పాపము బాధపెట్టును. యౌవనేచ్ఛ లకు ఒక మూల్యమున్నది. పాపములో జీవించు వారు సంతోషభరితులు కారు. "మీ పాపము మిమ్మును పట్టుకొనును". అకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతించవు అని యేసు ప్రభువు చెప్పెను (మత్త 24:35). మీరు యెహోవా దృష్టికి పాపము చేసిన వారగుదురు గనుక మీ పాపము మిమ్మును పట్టుకొనును (సంఖ్యా 32:23).

"ఎవడైనను పని చేయనొల్లని యెడల వాడు భోజనము చేయ కూడదని మీకు ఆజ్ఞాపించితిమి గదా"యని పౌలు థెస్సలోనికయులకు వ్రాసాడు (2 థెస్స 3:10). "యన్నే, యంబ్రే అనువారు మోషేను ఎదిరించినట్టు వీరును చెడిన మనస్సు కలిగి విశ్వాస విషయంలో భ్రష్టులై సత్యమును ఎదిరింతురు. అయినను వీరి అవివేకమేలాగు తేటపడెనో ఆలాగే వీరిది కూడ అందరికి తేటపడును గనుక వీరు ఇక ముందుకు సాగరు" అని పౌలు మరల చెప్పాడు (2 గలతీ 3:8-9).

"మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు; మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును, ఏలయనగా తన శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తనశరీరమునుండి క్షయమను పంట కోయును, ఆత్మను బట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్య జీవమును పంటకోయును" (గలతీ 6:7-8).

పాపి మీదను, పాపము మీదను లేఖనములు విధించు శిక్షను బట్టి మనం జాగ్రత్తగా యుందుము గాక! దేవుని యొక్కయు ఆయన కుమారుడైన యేసుక్రీస్తు యొక్కయు రక్షణ కృపను మనం ఎంచుకొందుము గాక (1 యోహా 4:14; హెబ్రీ 5:8; మార్కు 16:15-16; యోహాను 14:15; మత్తయి 28:18-20).

- డేటన్ కిస్సీ

2015 మార్చి 21వ తేదీశని వారం యాప్రాల్ క్రీస్తు సంఘము ఏర్పాటు చేసిన రెండురోజుల బైబిలు తరగతులకు అనేకులు హాజరైరి. జాషువాగూటం గారు, లాజరస్‌గారు వాక్యపరిచర్య చేసిరి. ఉదయం, మధ్యాహ్నము కూడి జాషువాగారు అపొస్తలులకార్యములు రెండవ అధ్యాయమును వివరించిరి. మొట్టమొదటి క్రీస్తుసంఘస్థాపన, దాని లక్షణములను చక్కగా విశ్లేషించిరి. లాజరస్ గారు ఆరాధనలో సంగీతమును గూర్చి వివరించిరి. హాజరైనవారందరికీ యాప్రాల్ క్రీస్తు సంఘము మంచి భోజనమును వడ్డించిరి. స్థానిక సువార్తికులు యమ్. ఆశీర్వాదము గారు, లెమూయేలు ..చారియా దంపతులు నిర్విరామ కృషిచేసి ప్రభువుకు మహిమ తెచ్చిరి. 2015 – 22వ తేదీ ఆదివారం జరిగిన ఆరాధనలో, క్రీస్తు మరణమును మరణింపజేసెను (Christ put death to death) అను అంశమును జాషువా గారు బోధించిరి. అనేకులు హాజరై ప్రభువును స్థానిక సంఘముతో కలిసి స్తుతించిరి. యాప్రాల్ క్రీస్తుసంఘము కొన్ని మాసముల క్రితమే స్థాపించబడినను, లెమూయేల్ గారి నాయకత్వములో ప్రభువుకొరకు గొప్ప పనులు చేయుచున్నారు.

21వ తేదీ శనివారం రాత్రి సికింద్రాబాద్ బాలాజీ నగర్‌లో జరిగిన కూటములో జాషువాగారు వాక్యపరిచర్యచేసిరి. అక్కడ సోదరులు రతన్ రాజుగారు పరిచర్యచేయుచున్నారు.

క్రీస్తు సంఘములు సమర్పించు
సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి ఆదివారము సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP/KD-02/2015-17

From :
SATYAVAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.